

# సర్జరీ లేకుండా హార్ట్ ట్రీట్మెంట్...

## టచ్ హాస్పిటల్‌లో 95% బ్లాకేజ్‌కు స్టెంట్ విజయం..

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**
తీవ్ర ఛాతీ నొప్పితో టచ్ హాస్పిటల్‌ను ఆశ్రయించిన సరోజ అనే రోగికి హార్ట్‌ఎటాక్ అని వైద్యులు నిర్ధారించారు. కార్డియోలాజిస్ట్ డా. రాజేష్. బి నేతృత్వంలోని వైద్య బృందం అత్యవసర పరీక్షలు నిర్వహించి, గుండెలో ప్రధాన రక్తనాళంలో 95 శాతం బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా ఈ స్థాయిలో ఉన్న బ్లాకేజ్‌లకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సిన పరిస్థితి ఉంటుందని వైద్యులు తెలిపారు. టచ్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న అధునాతన ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ (IVUS) కెమెరా గైడెడ్ టెక్నాలజీ ద్వారా సర్జరీ లేకుండా స్టెంట్ ను విజయవంతంగా అమర్చారు. చికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకోవడంతో, ఆమె బంధువులు హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డా. రాజేష్. బి మాట్లాడుతూ... హార్ట్‌ఎటాక్ వచ్చినప్పుడు ప్రతీ నిమిషం విలువైనది. మెరుగైన సదుపాయాలు, సకాలంలో చికిత్సే పేషెంట్ ప్రాణాలను కాపాడగలవు అని పేర్కొన్నారు. హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ.. టచ్ హాస్పిటల్‌లో అన్ని రకాల ఆధునిక వైద్య సదుపాయాలు లభ్యమవుతున్నాయని, దీని వల్ల దీర్ఘదూరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, మంచిర్యాలవాసులకు సమగ్ర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ పల్లెబాట యాత్ర విజయవంతం చేయాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
గ్రామ, గ్రామీణ జాగృతికై మేమెంతో.. మాకంత పల్లెబాట యాత్రను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలో ఈ యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ నేతృత్వంలో కొండ లక్ష్మణ్ బాపూజీ స్వగ్రామం వాంకిడి, ఆసిఫాబాద్ జిల్లా నుండి ఈ యాత్ర ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీసీ సబ్బండ వర్గాలను కలిపి రౌండ్ టేబుల్ సమావేశాలు, ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో పల్లెబాట యాత్ర రేపు మంచిర్యాల పట్టణానికి చేరుకుంటుందని, సాయంత్రం 4 గంటలకు బస్టాండ్ నుండి ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు, వివిధ కుల సంఘాల నాయకులు, కళాకారులు, ప్రజా సంఘనాయకులు, బీసీ కుటుంబ సభ్యులు, మద్దతుదారులు అందరూ ఈ కార్యక్ర మంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు సమావేశంలో పరికిపండ్ల అశోక్, వడ్డేపల్లి మనోహర్, గుమ్ముల శ్రీనివాస్, విద్యార్థి నాయకులు చేరాల వంశీ, హరీష్ గౌడ్, బీసీ జిల్లా నాయకులు గజ్జలి వెంకన్న, బీసీ యువజన నాయకులు లతీఫ్, ఎర్రోళ్ల రాజు, సందీప్ తదితరులు, పాల్గొన్నారు.

# జిల్లాకు మెడికల్ కళాశాల.. కేసీఆర్ శ్రమకు ఫలితం

* మెడికల్ కళాశాల పనుల్లో వేగం
* మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**
మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులను బీఆర్ఎస్ పార్టీ నేతలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఈ మెడికల్ కాలేజ్ మంజూరు అయినట్లు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాటిలో భాగంగానే మంచిర్యాల జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైందని, ఇది కేసీఆర్ శ్రమకు నిదర్శనమని పేర్కొన్నారు. నిర్మాణ పనులు తూర్పరగా పూర్తి చేసి కళాశాల ద్వారా జిల్లావాసులకు వైద్య విద్యతో పాటు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చూడనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుండి బెల్లంపల్లి చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో మాజీ దేశ సైనికులు కవాతు నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఉగ్రవాదుల దాడిలో అమరులైన ఇండియన్ ఆర్మీ జవాన్ ఎం. మురళి నాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఏప్రిల్ 22న పహల్గం ప్రాంతంలో అమరులైన జవాన్లకు సంతాపం ప్రకటించారు. బెల్లంపల్లి చౌరస్తాలో కళాకారులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణకు పోరాడిన ఆర్మీ జవాన్లకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సురేఖ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం మాజీ సైనికులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పిడిఎస్ రైస్ అక్రమ రవాణాలో ఇద్దరు అరెస్ట్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన నిందితులు చింతల మోసెస్ (28), పాస్తాం నరేష్ (34) ఎన్టీఆర్ నగర్, మంచిర్యాలలో నివాసం ఉంటున్నారు. వీరిని నేడు కోర్టులో హాజరుపరిచినట్లు మంచిర్యాల ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పీడీఎస్ రైస్‌ను దళారులకు విక్రయించడం నేరమని, ఎవరైతే రేషన్ బియ్యం విక్రయిస్తున్నారో వారి రేషన్ కార్డులు రద్దు చేయబడతాయని ఆయన హెచ్చరించారు. విచారణలో ఇతరులు కూడా రేషన్ బియ్యం విక్రయించినట్టు తేలితే, వారి కార్డులను రద్దు చేయాలంటూ ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ ఉద్దేశాలకు సరఫరా చేయాల్సిందే గానీ, విక్రయించడం నేరమని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ ఐ లు ప్రవీణ్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.




# తండ్రిని రోకలితో కొట్టి చంపిన తనయుడు

* నిర్మల్ జిల్లా రాజూరలో ఘటన



**శెనార్తి మీడియా, నిర్మల్(లోకేశ్వరం) :**
తండ్రిని రోకలితో కొట్టి తనయుడు చంపాడు. నిర్మల్ జిల్లా మండలంలోని రాజూర గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ముధోల్ సీఐ మల్లేశ్ కథనం ప్రకారం.. రాజూర గ్రామానికి చెందిన గన్నారం భూమన్న(80) కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు భూమన్న, రెండో కుమారుడు సుదర్శన్, మూడో కుమారుడు సాయికృష్ణ. సుదర్శన్ మూడేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. సాయికృష్ణ హైదరాబాద్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. పెద్దకుమారుడు భూమన్న భార్య సునీతకు ఏడాది క్రితం గొడవల కారణంగా పుట్టింటికి నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు వెళ్లిపోయింది. రాజురాలో తనకున్న మూడెకరాల్లో పెద్ద కుమారుడు వ్యవసాయంతోపాటు కూలీ పని వెళ్లి తండ్రి భూమన్నకు పోషించుకుంటున్నాడు. ఇద్దరు ఇంట్లో ఉంటున్నారు. మూడు రోజులుగా తిండి పెట్టటం లేదని తండ్రి, పెద్దకుమారుడి మధ్య గొడవ జరిగింది. శనివారం తెల్లవారుజామున ఇద్దరు గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన కుమారుడు రోకలితో తండ్రి తలపై కొట్టి హత్య చేశాడు. మృతుడి కుమార్తె సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అంతకుముందు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ముధోల్ సీఐ మల్లేశ్, లోకేశ్వరం ఎస్సై అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుపై విచారణ జరిపి నిందితుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# మురళి నాయక్ సేవలు చిరస్మరణీయం




**శెనార్తి మీడియా, ఆసిఫాబాద్:**
జమ్మూ కాశ్మీర్ పహాల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో అమరుడైన ఆర్మీ జవాన్ మురళి నాయక్ సేవలు భారతీయుల గుండెల్లో చిరస్మరణీయమని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో సైన్యం ఉగ్రవాదులను ఎలాంటి భయాందోళనలు లేకుండా ఎదుర్కొని ప్రాణాలకు తెగించి దేశం కోసం పోరాడిందని కొనియాడారు. ఈ సందర్భంగా అమరుడైన మురళి నాయక్ చిత్రపటానికి అజ్మీరా శ్యామ్ నాయక్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నిజాం, శ్రీనివాస్, కోమరం భీమ్ జిల్లా ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్మన్ రాథోడ్ రమేష్, బాణోత్ వెంకట్, రాథోడ్ రవీందర్, జాదవ్ ప్రకాష్, రాథోడ్ సుదర్శన్, రజాక్, బాలు, గణేష్, కెరమెరి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

* క్రమశిక్షణ ఉంటేనే వృత్తిలో విజయం
* శిక్షణ తరగతుల్లో ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**
దేశంలో, న్యాయవ్యవస్థలో రోజూ అనేక కొత్త చట్టాలు వస్తున్నాయని, వాటి పట్ల న్యాయవాదులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. శనివారం మంచిర్యాలలోనీ సుచిత్ర ఇన్ హోటల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాలు తెలిసి ఉంటేనే వృత్తిలో విజయం సాధించవచ్చని, అంతే కాకుండా న్యాయవాదులకు క్రమ శిక్షణ కూడా చాలా ముఖ్యం అని అన్నారు. చట్టాలపై అవగాహన లేకుండా వృత్తిలో విజయం సాధించలేరన్నారు. బెంచ్ అండ్ బార్ రిలేషన్ నేర్చుకోవాలన్నారు. సామాజిక బాధ్యతతో న్యాయవాదులు కక్షిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల ఏమాజి, జాడి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి శైలజ, వేణుగోపాల్ రావు, రమేష్ మక్కడ్, ఎం. శ్రీనివాస్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి మురళి, సీనియర్ న్యాయవాదులు రాజన్న, చిట్ల రమేష్, రాజేష్ గౌడ్, రవీందర్ రావు, రవీందర్, భుజంగరావు, గంగయ్య, వివిధ జిల్లాల నుండి 400 మంది న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## లైంగికవేధింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్




**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :**
ఓ మహిళ పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన ఓ మహిళ బంధువులు పంజాబ్‌లో నివసిస్తున్నారు. కొన్ని అవసరాల నిమిత్తం అమృత్‌సర్‌కు చెందిన అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్‌ను వీరు సంప్రదించారు. సదరు అధికారి డబ్బులు ఆశించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు నిరాకరించాడు. దీంతో అతన్ని మహిళ తరపు బంధువులు విజిలెన్స్ అధికారులకు పట్టించారు. వారిపై కక్ష పెంచుకున్న మునీష్ కుమార్ ఆదిలాబాద్‌కు చెందిన మహిళ పేరిట పేస్‌బుక్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి, సదరు మహిళ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ బృందం సహకారంతో, వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని గుర్తించి అమృత్‌సర్ నుంచి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.



# మంచిర్యాలలో పోలీసుల విస్తృత తనిఖీలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**
భారత సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు మంచిర్యాల ఏసీపీ అర్. ప్రకాష్ పర్యవేక్షణలో పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. మంచిర్యాల బస్టాండ్, రైల్వే స్టేషన్, రైల్వే అండర్ బ్రిడ్జ్, ఓవర్ బ్రిడ్జ్ వద్దగల రైల్వే ట్రాక్ వంటి రద్దీ ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. ఈ తనిఖీల్లో ఏసీపీ ప్రకాష్ స్వయంగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ అర్. ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలపై ఎటువంటి సందేహం కలిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. భవిష్యత్తులో అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో పట్టణ ఎస్సైలు ప్రవీణ్, కిరణ్, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ఆదాయం రూ.26.69కోట్లు

* 25శాతం రాయితీ గడువు పూర్తి
* సద్వినియోగం చేసుకున్నది కొందరే..
* గడువు తర్వాత చెల్లింపులపై సందిగ్ధం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) ద్వారా జిల్లాలో రూ.26.69కోట్ల ఆదాయం సమకూరింది. రాయితీ అవకాశం కల్పించినా కొందరే సద్వినియోగం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎల్ఆర్ఎస్ కోసం 2020లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి 25శాతం రాయితీ ప్రకటించగా ఈ నెల 3న గడువు ముగిసింది. మార్చి 31వరకు 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు మొదట ప్రభుత్వం అవకాశం కల్పించగా.. ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు, కొంత గందరగోళం నేపథ్యంలో ఏప్రిల్ 30వరకు గడువు పొడిగించింది. అయినప్పటికీ సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడం, మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఎల్ఆర్ఎస్‌కు అనుమతులు ఇవ్వడంలోనూ జాప్యం జరిగింది. దీంతో మరోసారి ఈ నెల 3వరకు గడువు పొడిగించినా దరఖాస్తుదారులు సద్వినియోగానికి ముందుకు రాకపోవడం గమనార్హం.